నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna

**జస్టిస్ బాగ్చి**

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి మార్చి 17న ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తుల నియామకానికి అనుమతి ఉంది. ప్రస్తుతం బాగ్చితో కలిపి 33 మంది న్యాయమూర్తులు ఉన్నారు.

**వెర్‌స్టాపెన్:** జపాన్ గ్రాండ్ ప్రి విజేతగా మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (నెదర్లాండ్స్) నిలిచాడు. ఏప్రిల్ 6న నిర్వహించిన ఫైనల్ రేసును 1.22.06 నిమిషాల్లో పూర్తి చేశాడు.



# ఏ కమిటీల సిఫారసుల ఆధారంగా జీవో 610 వెలువడింది?

**గతవారం తరువాయి..**

**20. ఆరు సూత్రాల పథకం ద్వారా కింది వాటిలో తెలంగాణకు జరిగిన నష్టాలు ఏవి?**

ఎ. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం ఈ పథకం వృథాగా మారింది
బి. ముల్కీ నిబంధనలు రద్దయ్యాయి
సి. తెలంగాణ రీజినల్ కమిటీని రద్దు చేశారు

1) ఎ, బి, సి 2) ఎ, బి
3) సి 4) ఏదీకాదు

**సమాధానం: 1**

**వివరణ:** 1) రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం అదేవిధంగా రాష్ట్ర రాజధాని ప్రగతి కోసం నిధులను కేటాయించాలి. దీని కోసం ప్రణాళికలను తయారు చేయాలి. ఇందుకు వెనుకబడిన ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించే శాసనసభ్యులతో పాటు ఇతర నిపుణులకు భాగస్వామ్యం కల్పిస్తూ రాష్ట్రస్థాయి ప్రణాళికా బోర్డును, వెనుకబడిన ప్రాంతాలకు సంబంధించిన ఉపసంఘాలను నియమించాలి.

2) విద్యాసంస్థల్లో స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చే విషయంలో రాష్ట్రానికంతా ఒకే విధానాన్ని పాటించాలి. రాజధాని ప్రాంతంలో ఉన్నత విద్యావంతులను పెంచడానికి కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలి.

3) ఒక నిర్ణీత స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రమోషన్ల విషయంలో కూడా ఒక నిర్ణీత స్థాయి వరకు ఈ నిబంధనలు పాటించాలి.

4) ఉద్యోగ నియామకాలు, సీనియారిటీ, ప్రమోషన్ వంటి విషయాల్లో వచ్చే ఫిర్యాదులను పరిశీలించడానికి ఉన్నతాధికారులు గల ఒక అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను నియమించాలి. ఈ ట్రిబ్యునల్ ఇచ్చే తీర్పులను రాష్ట్ర ప్రభుత్వం విధిగా అమలు చేయాలి.

5) పై సూత్రాలను పాటించడంలో ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులను, అనిశ్చిత పరిస్థితులను నివారించడానికి భారత రాజ్యాంగాన్ని సవరించే అధికారాన్ని రాష్ట్రపతికి కలిగించాలి.

6) పైన సూచించిన వాటిని పాటిస్తే ముల్కీ నిబంధనలు, తెలంగాణ ప్రాంతీయ కమిటీ కొనసాగింపు అవసరమవుతాయి.

**21. 1973, ఫిబ్రవరి 16న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోరుతూ ఏడుగురు తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులు తమ సభ్యత్వానికి రాజీనామా చేసినవారిలో లేని వారు ఎవరు?**

1) జీఎస్ మేల్కోటే, భీష్మదేవ్
2) మల్లికార్జున్, వీ తులసీరాం
3) కే రామకృష్ణా రెడ్డి
4) మర్రి చెన్నారెడ్డి

**సమాధానం: 4**

**వివరణ:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోరుతూ ఏడుగురు తెలంగాణ ఎంపీలు 1973, ఫిబ్రవరి 16న కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. వారు కే రామకృష్ణా రెడ్డి, మల్లికార్జున్, జీఎస్ మేల్కోటే, వీ తులసీరాం, రాజారామేశ్వర రావు, ఎంఎం హాషీం, భీష్మదేవ్.

**22. కింది వాక్యాలను పరిశీలించి సరైనది గుర్తించండి?**

ఎ. రాష్ట్రపతి వీకే రావు రాజ్యాంగంలోని ఆర్టికల్- 356 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు
బి. రాష్ట్రపతి పాలనకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్- పీవీ నరసింహారావు

1) ఎ 2) బి 3) ఎ, బి



4) ఏదీ సరైనది కాదు

**సమాధానం: 4**

**వివరణ:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన 1973, జనవరి 18న రాష్ట్రపతి వీవీ గిరి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 ప్రకారం విధించారు. కానీ రాష్ట్ర శాసనసభను రద్దు చేయలేదు. సస్పెండ్ చేసిన సుప్తచేతనావస్థలో ఉంచారు. రాష్ట్రపతి పాలనాకాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఖండూభాయ్ దేశాయ్, గవర్నర్ సలహాదారులు వీకే రావు, హెచ్‌సీ షరీన్. 1973, జనవరి 20న గవర్నర్ సలహాదారు హెచ్‌సీ షరీస్ 42 మంది ఆంధ్ర-తెలంగాణ డిటెన్యూల విడుదలకు ఉత్తర్వులు ఇచ్చారు.

**23. కింది వాటిలో సరైనది గుర్తించండి?**

ఎ. ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర హోం మంత్రి కేసీ పంత్ ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించారు
బి. 1973, అక్టోబర్ 3న సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ 'ముల్కీ రూల్స్ సక్రమమే' అని తీర్పు ప్రకటించింది

1) ఎ 2) బి 3) ఎ, బి 4) ఏదీకాదు

**సమాధానం: 1**

**వివరణ:** ఆరు సూత్రాల పథకం- 1973. 1972, అక్టోబర్ 2న సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ 'ముల్కీ రూల్స్ సక్రమమే' అని తీర్పు ప్రకటించడంతో సెప్టెంబర్ 21న షట్‌సూత్ర పథకాన్ని ప్రకటించింది. సుప్రీంకోర్టు ఫుల్‌బెంచ్ ముల్కీ రూల్స్ చెల్లుతాయని ప్రకటించిన తీర్పును ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వం ఆరు సూత్రాల పథకం ద్వారా ముల్కీ రూల్స్‌ను అడ్డంగా పాతిపెట్టే ప్రయత్నం చేసింది. ప్రధాని ఇందిరాగాంధీ, కేంద్ర హోం మంత్రి కేసీ పంత్ ఈ ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించారు.

**24. కింది వాటిలో ఏది సత్యం?**

**నిశ్చితం (ఎ):** 32వ రాజ్యాంగ సవరణ వల్ల 371 ఆర్టికల్లో క్లాజ్-1 తొలగించారు
**కారణం (ఆర్):** 32వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆరు సూత్రాల పథకానికి రాజ్యాంగ సవరణలు కల్పించారు

1) ఎ, ఆర్ సత్యం. ఎ కు ఆర్ సరైన వివరణ
2) ఎ, ఆర్ సత్యం. ఎ కు ఆర్ సరైన వివరణ కాదు
3) ఎ సత్యం, ఆర్ అసత్యం
4) ఎ అసత్యం, ఆర్ సత్యం

**సమాధానం: 2**

**వివరణ:** ఈ ఆరు సూత్రాల పథకాన్ని రాజ్యాంగ బద్ధం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ 1973, డిసెంబర్ 23న ఆమోదించడంతో ఆరు సూత్రాల పథకం 32వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగ బద్ధ చట్టంగా మారింది. రాజ్యాంగంలోని 371 ఆర్టికల్‌కు ఆరు సూత్రాల పథకంలోని అంశాలను చట్టం చేయడం ద్వారా 371(డి), 371(ఇ) నిబంధనలు ఏర్పడ్డాయి. 32వ సవరణ 1974, మే 3న రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాజ్యాంగ సవరణ 1974, జూలై 1 నుంచి చట్టంగా మారింది. ఈ సవరణ ద్వారా ఆరు సూత్రాల పథకానికి రాజ్యాంగ సవరణలు కల్పించారు. ఈ సవరణ వల్ల 371 ఆర్టికల్ లోని క్లాజ్-1ను తొలగించారు. ఈ క్లాజ్-1లో తెలంగాణ రీజినల్ కమిటీ విషయం ఉంది. అలాగే 7వ షెడ్యూల్‌లో మొదటి జాబితాలోని 63వ అంశాన్ని సవరించారు.

**25. పంచసూత్రాల పథకానికి సంబంధించి సరికానిది?**

ఎ. తెలంగాణ ప్రాంతంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు, తహసీల్దార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, జూనియర్ ఇంజినీర్ల పదవులకు ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి
బి. సచివాలయం వంటి సమ్మిళిత కార్యాలయాల్లో (అన్ని ప్రాంతాల ఉద్యోగులుండే కార్యాలయాల్లో) నాన్ గెజిటెడ్ పోస్టులకు ప్రత్యక్ష నియామకం సందర్భంలో ప్రతి మూడు ఖాళీల్లో రెండో ఖాళీకి అను వర్తింపజేస్తారు

1) ఎ 2) బి
3) ఎ, బి 4) ఏదీ సరైనది కాదు

**సమాధానం: 3**

**వివరణ:** పంచసూత్ర పథకం (1972, నవంబర్ 27) సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నాటి నుంచి పలు దఫాలుగా నేతలతో చర్చించిన నాటి ప్రధాని ఇందిరాగాంధీ రెండు ప్రాంతాల్లో ప్రజలను సంతృప్తిపరచాలనే ఉద్దేశంతో 1972, నవంబర్ 27న పంచ సూత్రాల పథకాన్ని లోక్‌సభలో ప్రకటించారు.

1) తెలంగాణ ప్రాంతంలో నాన్ గెజిటెడ్ ఉద్యోగాలకు, తహసీల్దార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, జూనియర్ ఇంజినీర్ల పదవులకు ముల్కీ నిబంధనలు వర్తిస్తాయి.

2) సచివాలయం వంటి సమ్మిళిత కార్యాలయాల్లో (అన్ని ప్రాంతాల ఉద్యోగులుండే కార్యాలయాల్లో) నాన్ గెజిటెడ్ పోస్టులకు ప్రత్యక్ష నియామకం సందర్భంలో ప్రతి మూడు ఖాళీల్లో రెండో ఖాళీకి అనువర్తింపజేస్తారు.

3) ఆంధ్ర-తెలంగాణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఉద్యోగుల ప్రమోషన్లకు తగిన అవకాశాలు కల్పించేందుకు వీలుగా ప్రథమ లేదా ద్వితీయ గెజిటెడ్ స్థాయి వరకు వివిధ సర్వీస్ క్యాడర్లను ప్రాంతీయం చేశారు. అఖిల భారత సర్వీసులకు ఈ పద్ధతి వర్తించదు.

4) జంటనగరాల్లో తెలంగాణ విద్యార్థులకు ప్రస్తుతం లభిస్తున్న సాంకేతిక, వృత్తి విద్యలతో సహా విద్యా సౌకర్యాలకు ఎలాంటి హాని కలిగించడం లేదు. ఈ సౌకర్యాలు తగిన విధంగా విస్తృతం అవుతాయి. ఈ అదనపు సౌకర్యాలు మాత్రం నివాస ప్రాతిపదికన గల నిషేధాలకు లోబడి ఉండవు.

5) హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలకు ఉమ్మడి పోలీసు బలగం ఉంటుంది. దీనికి సంబంధించిన వివరాలు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి రూపొందిస్తారు.

- విద్యారంగంలో వసతులు కల్పించి హైదరాబాద్ నగరంలో సీట్ల సంఖ్యను పెంచి కొత్త సీట్లను తెలంగాణ విద్యార్థులకు దక్కేలా చేసింది. ఉద్యోగాల్లో గెజిటెడ్ స్థాయిల పోస్టుల వరకు ప్రాంతీయీకరణ ద్వారా చూసి ఏ ప్రాంత ఉద్యోగులు ఆ ప్రాంతానికి చెందేలా చేయడంతో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగాల్లో తెలంగాణ వారు చేరే అవకాశం లభించింది.

**నోట్:** పంచసూత్ర పర్యవసానం ఈ పంచసూత్ర పథకం ఇరు ప్రాంతాల ప్రజలను సంతృప్తిపరచకపోగా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దారి చూపింది.

**26. జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పు- ముఖ్యాంశాల్లో సరైనది?**

ఎ. 'భారత రాజ్యాంగంలోని అధికరణ 15(3)లో పొందుపర్చిన అంశాలను బట్టి పార్లమెంట్ ఒక రాష్ట్రంలో గాని, ఒక రాష్ట్రం లోని ప్రాంతంలో గాని ఒక జిల్లాలోగాని తాలూకాలో లేదా ఒక గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలకు నివాసార్హతను నిర్దేశిస్తూ చట్టాన్ని రూపొందించడానికి అవకాశం ఉందని చెప్పడానికి ఏ మాత్రం అవకాశం లేదు' అని తీర్పులో వెల్లడించారు
బి. 'పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్- 1957 లోని 3వ సెక్షన్, దీనికి అనుబంధమైన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (నివాసార్హత) రూల్స్- 1959 నియమావళి చెల్లనేరవని, వీటిని అమలు చేయరాదని తీర్పు లో వెల్లడించారు

**గ్రూప్స్ ప్రత్యేకం**
**తెలంగాణ ఉద్యమ చరిత్ర**

1) ఎ 2) బి
3) ఎ, బి 4) ఏదీ సరైనది కాదు

**సమాధానం: 1**

**వివరణ:** 1969, ఫిబ్రవరి 3న రిట్ పిటిషన్ (రిట్ పిటిషన్ నంబర్ 2235/68, 3907/68, 3962/68)లలో తెలంగాణ ముల్కీ నిబంధనలు చెల్లవని జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పు ఇచ్చారు. జస్టిస్ చిన్నప రెడ్డి తీర్పు ముఖ్యాంశాలు.. 1969, ఫిబ్రవరి 3న హైకోర్టు న్యాయమూర్తి చిన్నపరెడ్డి తెలంగాణ ప్రాంతంలోని కొన్ని రకాల ఉద్యోగాల్లో స్థానికులను మాత్రమే చేర్చుకోవాలనే ముల్కీ నిబంధనలకు అవకాశం ఇచ్చిన 'పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ యాక్ట్- 1957లోని 3వ సెక్షన్. దీనికి అనుబంధమైన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ (నివాసార్హత) రూల్స్- 1959 నియమావళి చెల్లనేరవని, వీటిని అమలు చేయరాదని తీర్పులో వెల్లడించారు. అంతేగాక 1968, ఏప్రిల్ 30న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులు కూడా అమలు చేయరాదని ప్రభుత్వాన్ని ఆదేశించాడు. 'పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం- 1957లోని సెక్షన్ 1964లో సవరణకు గురైందని (ముల్కీల అమలు గడువు 5 సంవత్సరాలు పెంచుతూ చేసిన సవరణ), ఆ సవరణ కూడా చెల్లదని తీర్పులో ప్రకటించాడు. రాజ్యాంగంలోని 16(3) అధికరణ రాష్ట్రీయ సంకుచిత భావాలను ఉద్దేశించలేదని, అంతేగాకుండా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల విషయంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే సూత్రాన్ని త్యాగం చేయకుండా పనిలో సమర్థతను పెంపొందించడానికి మాత్రమే అది ఉద్దేశించిందని స్పష్టం చేశారు.

- రాజ్యాంగంలోని అధికరణ 16(3)లో పొందుపర్చిన అంశాలను బట్టి పార్లమెంట్ ఒక రాష్ట్రంలో గాని, ఒక రాష్ట్రంలోని ప్రాంతంలో గాని ఒక జిల్లాలో గాని తాలూకా లేదా ఒక గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలకు నివాసార్హతను నిర్దేశిస్తూ ఒక చట్టాన్ని రూపొందించడానికి అవకాశం ఉందని చెప్పడానికి ఏ మాత్రం అవకాశం లేదు అని తీర్పులో వెల్లడించారు.

**27. కింది వాక్యాలను పరిశీలించండి?**

ఎ. జయభారత్ రెడ్డి కమిటీ, సుందరేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా 1985, డిసెంబర్ 30న జీవో 610 వెలువడింది
బి. జీవో 610లో పేర్కొన్న అంశాలు 1986, మార్చి 31లోపు అమలు కావాలని ఆ జీవోలో రాసి ఉంది

1) ఎ 2) బి
3) ఎ, బి 4) ఏదీ సరైనది కాదు

**సమాధానం: 3**

**వివరణ:** తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ అధ్యక్షుడు 1985, డిసెంబర్ 5న రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రాన్ని సమర్పిస్తూ.. రాష్ట్రపతి ఉత్తర్వు ఏర్పాట్లను అతిక్రమించి తెలంగాణ ఉద్యోగ కేటాయింపులు చేశారని, వాటిని సరిచేయాలని కోరారు. ఆ వినతి పత్రంలోని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తరువాత ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులతో 1985, డిసెంబర్ 7న విస్తృతంగా చర్చించారు. ఈ చర్చల అనంతరం జరిగిన ఒప్పందం ఫలితంగా 610 ప్రభుత్వ ఉత్తర్వు (జీవో ఎంస్ నంబర్ 610) 1985, డిసెంబర్ 30న విడుదలైంది. జయభారత్ రెడ్డి కమిటీ, సుందరేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా 1985, డిసెంబర్ 30న జీవో 610 వెలువడింది. జీవో 610లో పేర్కొన్న అంశాలు 1986, మార్చి 31లోపు అమలు కావాలని ఆ జీవోలోనే రాసి ఉంది. సుందరేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా జీవో 610ను తెలుగుదేశం ప్రభుత్వం విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ పేరున 'ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ కుమార్' సంతకంతో విడుదలైన ఈ జీవోలో 6 నిబంధనలు, 5వ నిబంధనలో తెలంగాణ ఉద్యోగ సంఘాల నాయకులతో కుదిరిన ఒప్పందం ఫలితంగా అమలు చేయాల్సిన 13 అంశాల వివరాలు ఉన్నాయి.

**28. రాష్ట్రపతి జారీ చేసిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఉల్లంఘన గురించి కింది వాటిలో సరైనది?**

ఎ. జిల్లా స్థాయి క్యాడర్లను మార్చారు
బి. నాన్ గెజిటెడ్ క్యాడర్లను జోనల్ స్థాయి గెజిటెడ్ క్యాడర్లుగా మార్చారు
సి. నియామకాలు జరిగినప్పుడు ముందుగా ఓపెన్ కాంపిటీషన్ ద్వారా నింపిన కోటాకు బదులు రిజర్వ్ నింపుతారు

1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) పైవన్నీ

**సమాధానం: 4**

**వివరణ:** జిల్లా స్థాయి కేడర్లను మార్చారు: జిల్లా స్థాయి కేడర్ల అనుమతి లేకుండా లేదా ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నిబంధనలకు విరుద్ధంగా మారిస్తే అది ఉల్లంఘనగా పరిగణించవచ్చు. ఈ వాక్యం సరైనదే.

- గెజిటెడ్ స్థాయి కేడర్లుగా మార్పు చేశారు: నాన్ గెజిటెడ్ కేడర్లను గెజిటెడ్ కేడర్లుగా లేదా జోనల్ స్థాయికి మార్పు చేయడం, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నిబంధనలను ఉల్లంఘిస్తే తప్పు అవుతుంది. ఈ వాక్యం కూడా సరైనదే.
- ఓపెన్ కాంపిటీషన్ ద్వారా భర్తీ చేయాల్సిన స్థానాలను రిజర్వేషన్ ద్వారా భర్తీ చేశారు: ఓపెన్ కాంపిటీషన్‌కు చెందిన స్థానాలను రిజర్వేషన్ ద్వారా భర్తీ చేయడం ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నియమాలను ఉల్లంఘించడం అవుతుంది. ఈ వాక్యం కూడా సరైనదే.

**దొమ్మటి తిరుపతి**
ఫ్యాకల్టీ,
ఎస్ జే ట్యుటోరియల్స్

